మహనీయులకు ఇచ్చే గౌరవం ఇదేనా?

- అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే కదా మీ పదవులు
- విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకుల ఆగ్రహం

తిమ్మాపూర్, మార్చి 24: మహనీయులంటే మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పట్టింపు లేదా అని జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రాం విగ్రహాల ఆవిష్కరణ కోసం కృషి చేయాలని ఆదివారం వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తే, వారు స్పందించిన విధానం సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక రిలే దీక్ష శిబిరం వద్ద జేఏసీ కన్వీనర్లు సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడుపుల సంపత్, మాతంగి శంకర్, దుండ్ర రాజయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఆధారంగానే మీరు పదవుల్లో ఉన్నారని గుర్తు చేశారు. మహనీయుల విగ్రహాలు పెడితే తప్పేంటి అని ప్రశ్నించారు. విగ్రహాల చుట్టూ చెత్తాచెదారం నిండిపోయిందని, మహనీయులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ధ్వజమెత్తారు. కాగా, రిలే దీక్షకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్ణ వెంకటరెడ్డి, వివిధ సంఘాల అధ్యక్షులు మాచర్ల అనిల్, లక్ష్మణ్, కన్నం లక్ష్మణ్, మాజీ సర్పంచ్ వడ్లూరు శంకర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మాజీ సభ్యుడు ఎలుక ఆంజనేయులు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, నాయకులు సంగుపట్ల మల్లేశం, కొయ్యడ మురళి, సముద్రాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

కార్పొరేషన్, మార్చి 24: నగరంలో ప్రభుత్వ గ్రాంట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగంగా పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వారితో సమీక్ష నిర్వహించారు. నగర వ్యాప్తంగా వివిధ గ్రాంట్ల అభివృద్ధి పనులు, మంచి నీటి సరఫరా అంశాలపై చర్చించారు. టెండర్ దశ పూర్తయి, కొనసాగుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలన్నారు. టెండర్ దశలో ఉన్న అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వర్క్ ఆర్డర్ ఇవ్వాలన్నారు. పనులు ప్రారంభించి, పెండింగ్ పెట్టి ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. పనులు పూర్తయితే బిల్లులు రికార్డ్ చేసి సబ్‌మిట్ చేయాలని కోరారు. మానేరు డ్యాంలో నీటిమట్టం తగ్గుముఖం పడుతుండడంతో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈలు యాదగిరి, సంజీవ్, డీఈ లచ్చిరెడ్డి, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట, మార్చి24: సర్వే నంబర్ 647, 633లో జరిగిన అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ.. జమ్మికుంట పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త అమ్మ వెంకటేశ్ యాదవ్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సర్వే నంబర్ 647లోగల శ్రీనివాసా ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని సర్వే నంబర్ 633గా తప్పుడు పట్టాలు తయారు చేసి రిజిస్ట్రేషన్ చేశారని అందులో ఆరోపించాడు. కోట్లాది రూపాయల విలువజేసే భూములకు తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పేదల ప్రజలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశాడు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు

ప్రజావాణికి జనం బారులు

- మొత్తం 169 దరఖాస్తులు
- రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అత్యధికం
- పరిశీలించిన అధికారులు.. పరిష్కారానికి ఆదేశాలు

కలెక్టరేట్, మార్చి 24 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే గ్రీవెన్స్‌కు ప్రజలు క్యూ కట్టారు. కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఇతర అధికారులు హాజరై ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖల హెచ్‌వోడీలకు బదిలీ చేసి, వెంటనే బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చాలంటూ ఆదేశించారు. ఉదయం పదిన్నర గంటల నుంచి ప్రారంభం అయ్యే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి తరలి వచ్చారు. మొత్తం 169 దరఖాస్తులు రాగా, వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 65 అర్జీలు ఉన్నాయి. మరో 104 ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించినవి. ముఖ్యంగా గ్రామాల్లో భూ ఆక్రమణలు, పట్టణాల్లో రోడ్లు, పార్కుల స్థలాల కబ్జాకు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి.

కోర్టు తీర్పు అమలు చేయడం లేదు

జమ్మికుంట పట్టణంలో 24 క్రితం గుంటన్నర భూమి ప్రభుత్వం నాకు ఇంటి స్థలం కోసం కేటాయించింది. ఈ భూమిని తిరిగి తీసుకునేందుకు ప్రయత్నించగా, కోర్టుకు వెళ్లగా 2018లో నాకు అనుకూలంగా తీర్పునిస్తూ, రిజిస్ట్రేషన్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. అయితే, తహసీల్దార్లు మాత్రం రిజిస్ట్రేషన్ చేయడం లేదు. ఇదేంటని ప్రశ్నిస్తే నాపైనే కేసులు పెడుతామంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారు. కలెక్టరమ్మను కలిసినా లాభముంటలేదు. ఇప్పటికీ రెండుసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన. అధికారులకు నా అర్జీ కాపీ పంపుతున్నారు. చేతులు దులుపుకొంటున్నారు. నాకు న్యాయం చేయాలే.

-తుపాకుల రామస్వామి, జమ్మికుంట

రుక్మాపూర్ లెదర్‌పార్కుకు నిధులు కేటాయించాలి

జిల్లాలోని చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన లెదర్ పార్కుకు నిధులు కేటాయించి, పేద చర్మకార వృత్తిదారులకు ఉపాధి కల్పించాలి. కేంద్ర వాటా కింద ఇప్పటికే రూ.50కోట్లు జమ కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.10కోట్లు విడుదల చేయాల్సి ఉన్నది. చర్మ పరిశ్రమలో పనులు ప్రారంభిస్తే ప్రత్యక్షంగా పదివేల మందికి, పరోక్షంగా మరో పదివేల మందికి ఉపాధి లభిస్తుంది. ఏటా వందల కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించవచ్చు. అయినా, ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో తెలవడం లేదు.

-పాతూరి రమేశ్, రుక్మాపూర్ లెదర్‌పార్కు కార్మికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

మొరాయించిన కంప్యూటర్లు

కలెక్టరేట్, మార్చి 24 : కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కంప్యూటర్లు మొరాయించగా, అర్జీదారులు హైరానాపడ్డారు. కార్యక్రమం ప్రారంభం నుంచి అరగంట పాటు కంప్యూటర్లు పనిచేయకపోవడంతో తమ దరఖాస్తులు నమోదు చేసుకునేందుకు వచ్చిన వారంతా క్యూలైన్లలో బారులు తీరారు. వెంటనే సిబ్బంది రంగంలోకి దిగి సాంకేతిక సమస్యను పరిష్కరించడంతో, దరఖాస్తుల నమోదు యథావిధిగా కొనసాగింది. అప్పటికే మూడు వరుసల్లో పదుల సంఖ్యలో వేచి ఉండగా, వారిని కాదని నేరుగా వస్తున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకుని నమోదు చేస్తుండడంతో సిబ్బంది, అర్జీదారుల మధ్య వాగ్వాదం జరిగింది. కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ వెంటనే అక్కడికి చేరుకుని సిబ్బందిని మందలించి, దరఖాస్తుదారులను సముదాయించగా, వాగ్వాదానికి తెరదించారు.

సంక్షేమ శాఖ కార్యాలయం మార్చాలి

జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో గల ఓ అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఈ కార్యాలయం ఒకటో ఫ్లోర్‌లో ఉండటంతో జిల్లాలోని వికలాంగులు, వయోవృద్ధులు వివిధ పనుల మీద కార్యాలయానికి వస్తే, ఒకటో ఫ్లోర్‌కు మెట్ల ద్వారా వెళ్లడం ఇబ్బందిగా మారుతున్నది. వైకల్యం గల అనేక మంది మెట్లు జారి కింద పడి గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో, అత్యధిక మంది కార్యాలయానికి వెళ్లడానికి భయపడుతున్నారు. దురదృష్టవశాత్తు మెట్లపై నుంచి పడితే అటు చికిత్స చేయించుకోలేక, ఇటు వైద్య ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బందుల పాలయ్యే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, కార్యాలయానికి కింది గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చాలి.

-లక్ష్మణ్, దివ్యాంగ పట్టభద్రుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

ముకరంపుర, మార్చి 24: విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. విజిలెన్స్, ఏపీటీఎస్ పోలీస్ స్టేషన్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపిన వివిరాల ప్రకారం.. వీణవంక మండలం కోర్కల్ గ్రామానికి చెందిన మర్రి స్వామి విద్యుత్ చౌర్యానికి పాల్పడగా విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు ఏపీ టీఎస్, విజిలెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో జిల్లా ఒకటో అదనపు సెషన్స్ జడ్జి డీ వెంకటేశ్ నిందితుడికి రూ.13,071జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారని సీఐ తెలిపారు. ఎస్సైలు ఓంకార్ యాదవ్, కళా, విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

డిప్యూటీ ఆర్ఎంగా వెంకటేశ్వరావు

తెలంగాణచౌక్, మార్చి 24: ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్)గా బి. వెంకటేశ్వర్‌రావు బస్టాండ్ ఆవరణలోని డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సత్యనారాయణ పదవీ విరమణ పొందారు. బస్ భవనంలో కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్ రావు బదిలీపై డీఆర్ఎంగా ఇక్కడికి వచ్చారు.

రాష్ట్ర చెస్ చాంపియన్‌షిప్ విజేతగా విశ్వనాథ్ ప్రసాద్

కొత్తపల్లి, మార్చి 24 : హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 23న నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర చెస్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో కరీంనగర్‌కు చెందిన విశ్వనాథ్ చెస్ అకాడమీ కోచ్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్ విజేతగా నిలిచాడు. ఈ పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహించగా, 34 మంది అంతర్జాతీయ ఫిడే రేటెడ్ క్రీడాకారులు పాల్గొన్నారు. 6 రౌండ్లలో 6 పాయింట్లు సాధించి విశ్వనాథ్ ప్రసాద్ మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు అకాడమీ నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే అకాడమీకి చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి పతకాలు కైవసం చేసుకున్నారన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం

కలెక్టరేట్, మార్చి 24 : కరీంనగర్ రెవెన్యూ క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, ఉద్యోగుల సంఘం నాయకులు దారం శ్రీనివాస్ రెడ్డి, కాళీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి

కలెక్టరేట్, మార్చి 24 : కొద్దిరోజులుగా కొనసాగుతున్న శాసనసభ, శాసన మండలి సమావేశాల్లో సీపీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే చర్చించాలని సీపీఎస్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు మహేశ్వర్ కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్‌తో కలిసి ప్రతిపక్ష పార్టీ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలకు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో వినతిపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం కొనసాగించేందుకు శాసనసభ ఆమోదం తెలిపేలా చొరవ తీసుకోవాలని కోరినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ టీబీ చికిత్స సూపర్‌వైజర్‌గా 'పడిదం'

జమ్మికుంట, మార్చి 24: రాష్ట్ర ఉత్తమ టీబీ చికిత్స సూపర్‌వైజర్ అవార్డు పడిదం దేవేందర్‌రెడ్డిని వరించింది. జమ్మికుంట క్షయ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న దేవేందర్‌రెడ్డి, ఈ అవార్డు అందుకోవడం వరుసగా మూడోసారి. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర టీబీ డైరెక్టర్ డాక్టర్ రాజేశం రాష్ట్ర ఉత్తమ చికిత్స సూపర్‌వైజర్ అవార్డును జమ్మికుంట టీబీ సూపర్‌వైజర్ పడిదం దేవేందర్‌రెడ్డికి అందజేశారు. ఆయనకు మూడోసారి అవార్డు రావడంపై అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాణస్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మార్చి 24: తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రమాణ స్వీకారోత్సవ ఆహ్వాన కమిటీ సభ్యులు జంపాల సంపత్, కంది వెంకటేశ్ పిలుపునిచ్చారు. కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని జిల్లా, నగర నాయీబ్రాహ్మణ కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభం కానున్నదని, జిల్లా వ్యాప్తంగా నాయీబ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలిరావాలని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

తోటి మిత్రుల ఔదార్యం

వీణవంక, మార్చి 24: ఎలుబాక గ్రామానికి చెందిన ఊట్ల ప్రభుదాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, అతడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం ఊట్ల ప్రభుదాస్ ఇంటికి వెళ్లిన ఎలుబాక, ఆయా గ్రామాల మిత్రులు రూ.54,300 అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇక్కడ సీఐటీయూ మండల కన్వీనర్ పిల్లి రవియాదవ్, తోటి మిత్రులు, దాతలు ఉన్నారు.



WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330667-AII


గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దేవంపల్లి గురుకులంలో విద్యార్థికి తీవ్రగాయం

గాయపడ్డ విద్యార్థి కొమ్మగల్ల అశ్విత్

మానకొండూర్ రూరల్, మార్చి 24: దేవంపల్లి గురుకుల పాఠశాలలో తుప్పుపట్టిన బెడ్ రేకు కోసుకుపోయి ఓ విద్యార్థికి తీవ్ర గాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవంపల్లి గురుకుల పాఠశాలలో మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొమ్మగల్ల అశ్విత్ 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి 7 గంటల సమయంలో కరెంటు పోవడంతో అతడు బెడ్ పైనుంచి కిందికి దిగుతున్న క్రమంలో తుప్పుపట్టి ఉన్న బెడ్ రేకు కుడికాలుకు కోసుకుపోయింది. వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథం విద్యార్థి తల్లిదండ్రులు కొమ్మగల్ల సరవ్వ–సుధాకర్‌కు సమాచారం అందించి, జిల్లా ప్రధాన దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు దాదాపు 12 కుట్లు వేసి, మందులు ఇవ్వగా, అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా, ఈ ఘటనతో విద్యార్థి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పాఠశాలలో ఉన్న జనరేటర్ ఎందుకు ఆన్ చేయలేదని, పాత బెడ్స్‌ను ఎందుకు వాడుతున్నారని ప్రశ్నించారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని మండి పడ్డారు. కాగా, విద్యార్థికి తీవ్రగాయం కావడంతో సోమవారం విద్యార్థుల బెడ్స్ మరమ్మతు చేయిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభంపై హడావుడి

- సమన్వయలోపంతోనే వాయిదానా?

కార్పొరేషన్, మార్చి 24 : కరీంనగర్ నగరపాలక సంస్థలో చేపడుతున్న వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాల విషయంలో అధికారుల వ్యవహార తీరు విమర్శలకు దారి తీస్తున్నది. బల్దియా కార్యాలయ ఆవరణలో సోమవారం సాయంత్రం ఇందిరా మహిళా శక్తి పేరుతో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. దీంతో పాటు భగత్‌నగర్‌లోనూ మరో క్యాంటీన్ ప్రారంభించాలని ఏర్పాట్లు చేసుకున్నారు. కాగా, సోమవారం సాయంత్రం ఆ మేరకు నగరపాలక కార్యాలయ సంస్థ క్యాంటీన్ వద్ద కొద్ది సేపు టీ అమ్మకాలు కూడా చేపట్టారు. భగత్‌నగర్‌లో క్యాంటీన్ ప్రారంభించిన అధికారులు, బల్దియా ఆవరణలో క్యాంటీన్ ప్రారంభోత్సవాన్ని మాత్రం వాయిదా వేసినట్లు తెలుస్తున్నది. కాగా, ఇప్పుడు ఇదే విషయం నగరపాలక సంస్థలో తీవ్ర చర్చకు దారి తీసింది. నగరపాలక సంస్థలో చేపడుతున్న వివిధ ప్రారంభోత్సవాల విషయంలో అటు అధికారపార్టీ ప్రజాప్రతినిధులకు, ఇటు స్థానిక ఎమ్మెల్యేకు కూడా సమాచారం ఇవ్వకుండానే చేపడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల నగరంలో తాను చేపడుతున్న ప్రారంభోత్సవాల కార్యక్రమాలకు నగరపాలక అధికారులు రావడం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపణలు కూడా చేశారు. ఈ క్యాంటీన్ ప్రారంభోత్సవ విషయంలోనూ నగరపాలక అధికారులు చివరి సమయంలో స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తున్నది. దీంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం వల్లే ఈ క్యాంటీన్ ప్రారంభోత్సవం వాయిదా పడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా, భగత్‌నగర్‌లోని మహిళా శక్తి క్యాంటీన్ మాత్రం కలెక్టర్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు.

లింగాపూర్‌లో దొంగల హల్‌చల్

శంకరపట్నం, మార్చి 24: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రిపూట దొంగలు రెచ్చిపోయారు. తాళాలు వేసిన ఇండ్లే లక్ష్యంగా దోపిడీలకు తెగబడ్డారు. ఇలా ఎనిమిది ఇండ్లలో తాళాలు పగుల గొట్టి చోరీలకు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన నాగండ్ల శ్రీనివాస్ ఇంట్లో రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, చింత శ్రీనివాస్ ఇంట్లో 40 తులాల వెండి, రూ.10 వేల నగదు, కవ్వ మణెమ్మ ఇంట్లో 5 తులాల బంగారం దొంగలు దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అలాగే కవ్వ బుచ్చమ్మ, గూడ విమల, దేవుడి రాజిరెడ్డి, కాసిడి పోశిరెడ్డి, గూడ భూమిరెడ్డి ఇండ్లల్లో సైతం దొంగలు దోపిడీకి పాల్పడ్డారు. గ్రామాన్ని సోమవారం ఏసీపీ శ్రీనివాస్‌జీ, హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, కేశవపట్నం ఎస్ఐ రవి, సిబ్బందితో సందర్శించారు. బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

టీబీ నిర్మూలన సాధ్యమే

- ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్

మాట్లాడుతున్న ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్

విద్యానగర్, మార్చి 24 : ప్రపంచవ్యాప్తంగా 2030 వరకు టీబీని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా డబ్ల్యూహెచ్‌వో ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్ తెలిపారు. ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కరీంనగర్ చెస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఎనమల్ల నరేశ్ మాట్లాడుతూ, మనదేశంలో 2015 సంవత్సరంలో ప్రతి లక్షమందిలో 237 టీబీ కేసులుండగా, అది 2023 సంవత్సరంలో 195 మందికి తగ్గిందని తెలిపారు. చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ సుమన్ మాట్లాడుతూ, టీబీ ఊపిరితిత్తులకే కాకుండా మెదడు, కడుపులోని అవయవాలు, జననేంద్రియాలకు సైతం సోకుతుందని తెలిపారు. సీనియర్ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ, మల్టీడ్రగ్ రెసిస్టెన్స్ టీబీ సొసైటీకి చాలా ప్రమాదకరమని, మందులను పూర్తి డోస్‌గా వైద్యులు చెప్పినట్లుగా వాడాలన్నారు. డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, పిల్లల్లో టీబీ లక్షణాలు, నిర్ధారణ, వ్యాధి నిర్మూలన చర్యలు వివరించారు. ఎక్స్ రే, బయాప్సీ ద్వారా టీబీని ఎలా నిర్ధారించవచ్చో డాక్టర్ నవీన్‌కుమార్ వివరించారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ డాక్టర్లు సూచించిన విధంగా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే టీబీ వ్యాధి పూర్తిగా నయం చేయవచ్చన్నారు. అలాగే ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా పూర్తిస్థాయి కోర్స్ అందజేస్తారన్నారు.

మొండి బకాయిదారుల ఆస్తుల సీజ్

కార్పొరేషన్, మార్చి 24 : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తులను అధికారులు సోమవారం సీజ్ చేశారు. వెంకటసాయి థియేటర్ రూ.8 లక్షలు, లిటిల్ పార్కు రూ.9 లక్షల మేరకు బకాయి ఉండగా, గతంలోనే నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు ఆర్వో భూమానందం తెలిపారు. సకాలంలో నోటీసులకు స్పందించకపోతే చట్టపరంగా కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

చిగురుమామిడి, మార్చి 24: ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ విమర్శించారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాలను పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూలీలకు గిట్టుబాటు కూలి రావడంలేదని, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెంచాలన్నారు. 200 రోజులు కూలీలకు పని దినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు జనార్దన్, లక్ష్మి, రజిత, మాధవి, కనకవ్వ, శ్రీనివాస్, రాజయ్య తదితరులు ఉన్నారు.

రైతులకు సేవ చేయడమే లక్ష్యం

కరీంనగర్ రూరల్, మార్చి 24: కరీంనగర్ వ్యవసాయ పరపతి సహకార పరపతి సంఘం రైతుల సేవే లక్ష్యంగా పని చేస్తున్నదని సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం సొసైటీ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, కరీంనగర్ సింగిల్ విండో సొసైటీని, రెండు సింగిల్ విండోలుగా మార్చేందుకు తీర్మానాలు చేసి, కలెక్టర్, సంబంధిత అధికారులకు అందించామని, కరీంనగర్ సొసైటీతో పాటు మరొకటి కొత్తపల్లి మండలంలో ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. కరీంనగర్ సొసైటీని నాబార్డ్ పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిందని, దాని ద్వారా వచ్చే నిధులతో రానున్న రోజుల్లో కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వార్షిక నివేదికను సొసైటీ సీఈవో మేకల రమేశ్ చదివి వినిపించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, డైరెక్టర్లు సెవెల్ల లత, గంట శంకరయ్య, బోనాల నర్సయ్య, బోనాల లింగయ్య, ఉల్లెందుల లక్ష్మి, బోనాల తిరుమలయ్య, మూల వెంకట రవీందర్ రెడ్డి, కుతాడి ఎల్లయ్య, సాయిల్ల మహేందర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల అరెస్ట్

తిమ్మాపూర్/చిగురుమామిడి/హుజూరాబాద్ రూరల్/శంకరపట్నం, మార్చి 24: తమ సమస్యల పరిష్కారం కోసం ఆరోగ్య శాఖ కమిషనరేట్ ముట్టడికి తరలుతున్న ఆశ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్‌గేట్ వద్ద మూడు బస్సుల్లో వెళ్తున్న సుమారు 300 మందిని అదుపులోకి తీసుకొని కరీంనగర్‌లోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగేందుకు వెళ్తున్నామని, ఆశ వర్కర్ యూనియన్ నేతలు ఎంత మొత్తుకున్నా పోలీసులు వినలేదు. పోలీసులు, ఆశ కార్యకర్తల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకున్నది. అనంతరం పోలీసులు వారిని బలవంతంగా కరీంనగర్ తరలించారు. చిగురుమామిడి మండలం ఇందుర్తిలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేళ్ల శ్రీలతను ఆమె నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. హుజూరాబాద్‌లో ఆశ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. కేశవపట్నంలో పలువురు ఆశ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముట్టడికి వెళ్లబోమనే హామీతో తర్వాత వదిలిపెట్టారు.

ఆశ కార్యకర్తల నిర్బంధం దారుణం

తెలంగాణచౌక్/విద్యానగర్, మార్చి24: తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆరోగ్య శాఖ కమిషనరేట్ ముట్టడికి తరలివెళ్తున్న ఆశ కార్యకర్తలను మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రి వారి ఇండ్ల మీదదాడులు చేసి అక్రమంగా నిర్బంధించడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మండిపడ్డారు. నగరంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, నిరసన తెలుపడం రాజ్యాంగ హక్కు అని, శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న వారిని ముందస్తు అరెస్టు చేయడమేమిటని ప్రశ్నించారు. బస్సులో వెళ్తున్న వారిని అడ్డగించి, తనిఖీలు చేస్తూ హ్యాండ్ బ్యాగ్‌లు, సెల్ ఫోన్లు లాక్కొని భయాందోళనలకు గురిచేయడమేమిటన్నారు. పోలీసుల ప్రవర్తన సరిగాలేదన్నారు. ప్రభుత్వం పోలీసులతో ఉద్యమాన్ని అడ్డుకోవాలని చూస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

'ఒర్రె కబ్జాపై విచారణ జరుపండి'

తిమ్మాపూర్ రూరల్, మార్చి 24: మండలంలోని పర్లపల్లిలోని పెట్రోల్ కుంట, గుమ్మడోనికుంట మత్తడి నీరు పారే ఒర్రెను పూడ్చి కొంత మంది కబ్జా చేస్తున్నారని గ్రామానికి చెందిన గుమ్మడి మల్లయ్య సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీరు పారే ఒర్రెను పూడ్చడం వల్ల ఇతర రైతులకు నష్టం కలుగుతుందన్నారు. ఈ విషయంపై సంబంధిత ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, దీనిపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

టీబీ నిర్లక్ష్యం.. ప్రాణాంతకం

విద్యానగర్, మార్చి 24 : టీబీని నిర్లక్ష్యం చేయడం ప్రాణాంతకమని, వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నియంత్రించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌వో మీటింగ్ హాల్‌లో ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా ఓరియంటేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. టీబీ వ్యాధి వ్యాప్తి చెందే విధానం, నివారణ చర్యల గురించి వివరించారు. టీబీ వ్యాధి నివారణ కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన వైద్యాధికారులు, టీబీ నోడల్ పర్సన్లు, ఆశ నోడల్ పర్సన్లు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, స్టేట్ టీం అధికారులు హేపోజిబా, ఉష, సంపత్, జిల్లా ప్రోగ్రాం అధికారులు సాజిదా, విప్లవశ్రీ, సన జవేరియా, సిబ్బంది పాల్గొన్నారు.

గణిత ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మార్చి 24 : అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు జోనల్ స్థాయి గణిత ఒలింపియాడ్‌లో అత్యధిక సంఖ్యలో పతకాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయన అభినందించారు. పాఠశాలలో ఇచ్చిన ప్రోత్సాహంతో వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులు ఎంపికవుతూ, ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఎస్‌వోఎఫ్ నిర్వహించిన జోనల్ స్థాయి గణిత ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందిన జతిన్ సిద్ధార్థ్, సాయి విగ్నేశ్, పి.మయాంక్ పేరటి, ఎ.విహన్ కృష్ణ, జోయెల్ దేవిన్, బి. కార్తికేయ, తన్మయి బొల్లి, అవంతిక తిపిరెడ్డి తదితరులు ప్రతిభ చూపి విజేతలుగా నిలవడమే కాకుండా బంగారు పతకాలు సాధించారని వివరించారు.

ఉద్యోగాలకు ఎంపికైన 'వివేకానంద' విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కమాన్‌చౌరస్తా, మార్చి 24 : జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు కాన్ స్టర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన రాత పరీక్షలో అర్హత సాధించి, అనంతరం మౌఖిక పరీక్షలోనూ ప్రతిభ చాటి డేటా సెంటర్ సేల్స్ అసోసియేట్ ఉద్యోగాన్ని సంపాదించారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన ఎస్. లావణ్య, జి. గాయత్రి, సీహెచ్ బిందు, అబ్దుల్ హాధి, ఆర్యన్ కళ్యాణ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీపీవో మహ్మద్ అబ్దుల్ సలీం, ఏసీవో సంపత్ కుమార్, ఏవో శ్రావణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తెలంగాణచౌక్, మార్చి 24: ఇటీవల అకాల వర్షంతో జిల్లాలో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిహారం అందజేసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్ర భవనంలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు వరికి రూ.30వేలు, మక్కకు 20వేలు, మామిడికి 40వేల చొప్పున సాయం అందించాలన్నారు. పంటకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.